# 'పాత'సినిమా సూపిత్త మావా!

## -ప్రతాప వెంకట సుబ్బరాయుడు

**మాట అనేది ఎంత పవర్‌ఫుల్లో ఉగ్గుపాలతో సినిమాలు చూస్తూ పెరిగి పెద్దయిన శ్రీపంచ్‌కి తెలుసు.**

**మాట అనేది ఎలా కదిపేస్తుందో...కుదిపేస్తుందో ఛానల్ టీవీల్లో ఒక్కో అంశాన్నీ ఊదరగొట్టే విధానం చూసి అర్థం చేసుకున్నాడు. అందుకనే మాటలెలా ప్రయోగించాలో చిన్నప్పటి నుండీ తనకంటూ ఒక ప్రత్యేకమైన గ్రామర్ తయారు చేసుకున్నాడు శ్రీపంచ్.**

**మాటలతో చెడుగుడు ఆడడం అతడికిప్పుడు కరతలా మలకం.**

తనకి విలువొచ్చి తన రేంజ్ పెరగాలంటే సినిమాల్లో కెళ్ళడం ఒక్కటే మార్గం అని తెలుసుకుని, ఒక ఫైన్ డే తెనాలి నుండి హైదరాబాద్ చేరుకున్నాడు. నానా కష్టాలుపడుతూ బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కృష్ణానగర్, ఫిల్మ్‌నగర్‌లలో తనకో అవకాశం ఇచ్చే వాళ్ళకోసం భూతద్దం పెట్టుకుని వెదక సాగాడు.

స్టూడియోల చుట్టూ తిరుగుతూ, డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు నిత్యం సంచరించే హోటళ్ళు, బార్లలో కాపు కాయసాగాడు.

అతని టైం బాగుందో లేక ఆ యువ డైరెక్టర్ లక్కో గానీ మొత్తానికి వాళ్ళిద్దరి కలయికా ఆ బార్లో జరిగింది.

"ఫిలిమ్ ఇనిస్టిట్యూట్‌లో కోర్స్ చేసిన డైరెక్టర్ని నేను. నా దగ్గర సక్కటి కథుంది. ఐదేళ్ళ నుండీ ఒక్కొక్కడి ముడ్డెనక తిరిగీ తిరిగీ మొత్తానికి ఒక ప్రొడ్యూసర్ని ఒడిసి పట్టుకున్నా. ఆడు నా కథకి డబ్బులెట్టడానికి రెడీగా ఉన్నాడు. కానీ ఇన్నాళ్ళూ మాటలు రాసేవాడే దొరకలేదు. ఆల్రెడీ ఫీల్డ్‌తో అనుభవం ఉన్నోళ్ళని పెట్టుకుందామంటే, అంతకు ముందు ఉన్నోళ్ళు నాటకీయంగా రాశారు. ఇప్పుడు ఉన్నోళ్ళు పంచ్‌లమయంగా రాస్తున్నారు. నా కథకి ఓ ఫ్రెష్ డైలాగ్ రైటర్ కావాలి. సుడి అంటే ఇదే! ఇన్నాళ్ళకి నువ్వు దొరికావు. నేనూ కొత్తే. నువ్వూ కొత్తే, ప్రొడ్యూసరూ కొత్తే, దీనబ్బ! సినిమా కూడా కొత్తగా ఉండాల. ఇరగదియ్యాలి. ఇప్పుడసలే కొత్తోళ్ళు లో బడ్జెట్ సినిమాల హవా నడుస్తోంది. వసూళ్ళలో పెద్ద సినిమాలతో సమానంగా పోటీ పడుతున్నాయి. తీయబోయే సినిమాతో మనం సెటిలైపోవాలి అంతే!" అన్నాడు ముందు ఫ్యూచర్ విజన్ ఇచ్చిన కిక్కుతో.

శ్రీపంచ్ ఆనందం అంతా ఇంతా కాదు. తంతే బీర్ డ్రమ్ములో పడ్డట్టయింది.

***

సినిమా సెట్స్ మీదకెళ్ళింది.

"ఈ సీన్‌లో హీరో కాలేజీకొచ్చి హీరోయిన్తో రొమాంటిక్‌గా మాట్లాడాలి. రాసేయండి. కానీ రొటీన్‌గా ఉండకూడదు" అన్నాడు డైరెక్టర్.


"అలాగే" అని ఓ గంట తర్వాత డైలాగ్ పేపర్స్ ఉన్న ప్యాడ్ పట్టుకొచ్చాడు శ్రీపంచ్.

పేపర్ మీద పరుచుకున్న సంభాషణ.

"ఏంటి రాజూ! ఇరవై నాలుగ్గంటల తర్వాత నన్ను కలిసేది? విరహంతో తల్లడిల్లిపోయాను తెలుసా?"

"రాధీ! నేను మాత్రం సుఖంగా ఉన్నాననుకున్నావా? చూడు ఇరవై నాలుగ్గంటల ముందు నా వెయిట్ సెవెంటీ ఎయిట్ కేజీస్, ఇప్పుడు సెవెంటీ... ఎయిట్ కేజీస్ లాస్ట్ ఇన్ ట్వెంటీ ఫోర్ అవర్స్" బాధగా అన్నాడు.

"నిజమే రాజూ! పీక్కుపోయిన నీ ముఖం,



పెరిగిపోయిన గడ్డం చూస్తే జాలేస్తోంది. నిన్ను పెళ్ళి చేసుకోవడంతప్ప నేను నీకేం చేయగలను".

పరుగెత్తుకుంటూ వచ్చి గట్టిగా అతన్ని కౌగలించుకుంది.

"సూపర్బ్... ఒకే ఒక్క సంభాషణలో ట్వెంటీ ఫైవ్ అవర్స్ విరహాన్ని సుత్తి లేకుండా, సూటిగా పాత్ర చేత చెప్పించేశావు" శ్రీపంచ్‌ని అభినందనల్లో ముంచెత్తాడు యువ డైరెక్టర్.

***

"ఈ సీన్లో హీరో అనుకోని పరిస్థితుల్లో ఒక అన్నం పొట్లంతో నిర్మానుష్యంగా ఉన్న వీధిలో వెళుతుంటాడు. కొంతదూరం వెళ్ళాక ఎలక్ట్రికల్ పోల్ దగ్గర కూర్చుని సరిగ్గా అన్నం తిందామనుకున్న సమయానికి అతని దగ్గరికి నాలుగు కుక్కలు వస్తాయి. సీన్ రాసేయండి".

శ్రీపంచ్ కాగితాల మీద పరపరా రాసుకొచ్చిన సీన్...

"నాలుగు కుక్కలకీ నాకూ ఈ పొట్లం సరిపోదు. నేను ఎలాగైనా మళ్ళీ డబ్బు సంపాదించగలను. దాంతో అన్నం తినగలను. కానీ మీకెలా? అయ్యో మీకు సంపాదించడం రాదే!" అని వాటికి అన్నం పెడతాడు. అవి మళ్ళీ అందులో కొంత అన్నం మిగిల్చి ఆ పొట్లం అతడివైపు తోస్తాయి.

'జంతువుల్ని మనిషి బానిసలుగా చూస్తాడు. కానీ అవెప్పుడూ మనిషిని అలా చూడవు. చూసుంటే ఇప్పుడు అవి మాత్రమే ఉండేవి భూమ్మీద. మనిషి కాదు' హీరో స్వగతంగా అనుకుంటాడు.

"వారెవ్వా! అది కలమా, మెదడు కార్ఖానా గొట్టమా? జంతువులు, మనుషుల మధ్య ప్రేమ సబ్జెక్ట్‌తో ఎన్నో సినిమాలొచ్చాయి. కానీ మనుషులతో అవి సమానమని ఒక్క డైలాగ్‌తో ఎలా చెప్పావయ్యా బాబూ! ఫెంటాస్టిక్" అరిచాడు.

***

"మీ అమ్మా, నాన్న ఏడుస్తూ ఎక్కడికెళుతున్నారు?" హీరో అడిగాడు.

"నా సంపాదన సరిపోవట్లేదని వాళ్ళు ఓల్డేజ్ హోంకి వెళ్ళిపోతున్నారు" కన్నీళ్ళతో అన్నాడతను.

"అదేంటండీ కొడుకుతో పాటు కలో గంజో తాగి బ్రతకాలిగానీ అలా పెళ్ళికాని వాణ్ణి ఒంటరిని చేసి వెడతారా?"

"బాబూ, మేముంటే వాడు గంజి కూడా తాగలేడు. అందుకే మనసు రాయి చేసుకుని వెళుతున్నాం".

"అంటే మీరు లేకపోతే, నేను మాత్రం బ్రతుకుతాననుకుంటున్నారా? ఇప్పుడే వెళ్ళి అనాథ శరణాలయంలో చేరిపోతా!"

"ప్రేమలు, ఆప్యాయతలు లేని మనసులు చుక్కనీరు లేని ఎడారులు. మిమ్మల్ని చూస్తే 'మనుషులు ఇలా ఉంటే బాగుణ్ను' అనిపిస్తుంది. దయచేసి లోపలికెళ్ళండి" హీరో కన్నీళ్ళతో అర్థించాడు.

"నువ్వు చెప్పావని లోపలికి వెళుతున్నాం బాబు".

"మార్వలెస్, కుటుంబ సభ్యుల మధ్య ఉండే ప్రేమాభిమానాలతో కంటనీరు పెట్టించావు. రేపు థియేటర్లో కన్నీళ్ళతో కాసులు రాల్తాయి" ఈసారి ప్రొడ్యూసర్ గంగవెర్రులెత్తాడు.

***

"విలన్‌తో హీరో కలిసే మొట్టమొదటి సన్నివేశాన్ని కలంతో కుమ్మెయ్ శ్రీపంచ్".

"అలాగే సార్!"

కాసేపటి తర్వాత, రాసుకొచ్చిన సీన్

"వెల్‌కమ్... సిగరెట్ తాగుతావా?"

"వద్దు"

"మందు తీసుకుంటావా?"

"అవసరం లేదు!"

"పోనీ జనక్ జనక్ పాయల్బాజే" కన్నుగీటుతూ ఆఫర్ చేశాడు.

"అఖ్ఖర్లేదు".

**పేరుకు తగ్గట్టే శ్రీపంచ్ గొప్ప డైలాగ్ రైటర్. అదెలాగంటే మాటల ప్రయోగం, వాటి విలువ బాగా తెలిసినవాడన్నమాట. ఆ ప్రయోగాలన్నీ ఉగ్గుపాలతోనే నేర్చుకున్నాడుమరి. అతడి గొప్పతనాన్ని ఎవరూ గుర్తించడంలేదు. ఇకదాంతో చంకన తెల్లకాగితాలు పెట్టుకుని హైదరాబాద్ వచ్చేశాడు. ఫిలిమ్‌నగర్, కృష్ణానగర్ అంతా గాలించి ఓ కుర్ర డెరైక్టర్ని పట్టాడు. మరి వాళ్ళిద్దరూ కలిసి ఏం చేశారు?**

"నిఖార్సయిన మంచి బాలుడెవ్వడూ ఇంత వరకూ ఇక్కడికి రాలేదు. నిన్నుచూస్తే ఆశ్చర్యం కలుగుతోంది".

"మీ ఊపిరితిత్తులు పొగచూరిపోయాయి. మీ చర్మంకింద రక్తం బదులు ఆల్కహాల్ ప్రవహిస్తోంది. ఒంటినిండా సుఖరోగాలు తాండవిస్తున్నాయి. నేను స్వచ్ఛమైన అమ్మపాలు తాగి పెరిగాను. అవినీతికి ఆమడదూరం ఉంటా."

"ఓహ్! భారతీయుడివన్న మాట."

"యస్, నన్ను చూస్తే చూశావా! నీకు దేశం గుర్తుకొచ్చింది. దొంగ పాస్‌పోర్ట్‌లతో దేశాలు తిరిగే నీకు మాతృదేశం, మాతృమూర్తి విలువా ఏం తెలుస్తాయిరా, లుచ్చా!"

"ఇంకా ఏం చూస్తున్నార్రా, కాల్చిపాడేయండీణ్ణి".

"అల్లూరి సీతారామరాజు కాలం నుండీ ఇప్పటిదాకా గన్నులు ఎత్తుతూనే ఉన్నారు. కానీ గెలిచిందెవరు? చరిత్రలో నిలిచిందెవరు? మారణాయుధాలు కేవలం భయపెట్టడానికి, చివరికి మానవత్వాయుధమే చెడుని మట్టి కరిపించేది" అని కేవలం కాళ్ళూ చేతులతోటే విలన్ తొత్తుల్నీ, విలన్‌ని ఓడించాడు.

విలన్ దగ్గరగావచ్చి "నాకు పుట్టినదే అయినా, తులసి మొక్కలా పెరిగిన నా కూతురు నాకు దూరంగా ఉంటూ నిన్ను కోరుకుంటోంది. ఆ విషయం నాకు నిన్ననే తెలిసింది. ఇన్నాళ్ళకి నా వంశ సముద్రం నీ రాకతో స్వచ్ఛమైన గంగవుతోంది. వచ్చే జన్మంటూ ఉంటే మా అమ్మాయి కడుపునపుట్టి మంచి పౌరుడినవుతా. మేరా భారత్ మహాన్" అంటూ తనని తను కాల్చుకుని చనిపోయాడు.

సినిమా చివర్లో

పుట్టినప్పుడు ఎవరం ఎక్కడ పుట్టామో తెలియదు.

కానీ ఉత్తమ భారతీయుడిగా తనువు చాలించాలి.

శుభం.

అని చూపించారు.

***

'సెన్సార్ ఆఫీసుకి రానవసరం లేని చక్కటి సినిమా' అని సెన్సార్ సభ్యుల ప్రశంసలతో క్లీన్ సర్టిఫికెట్ పొందింది.

"సినిమా మొదట్లో 'ధూమపానం నిషేధం' అన్న ముఖేష్ ఫిల్మ్, తాగుడు సీన్లపై వచ్చే 'మద్యపానం ఆరోగ్యానికి హానికరం' అని చూపించనవసరం లేని స్వచ్ఛమైన సినిమా" అని అందరూ ప్రశంసించారు.

"సినిమాలో మనుషులతో పాటు జంతువులను సమానంగా చూశారు" అని జంతుప్రేమికులు జూలో కూడా ప్రత్యేక షోలేసి అభినందించారు.

టీవీ ఛానల్స్ వాళ్ళు సినిమానీ, ఆ సినిమా టీమ్‌నీ భుజాలమీద కెత్తుకున్నారు. జిల్లాల వారీగా విజయ యాత్రలు ఊపందుకున్నాయి.

నాన్‌వెజ్ తినీ తినీ ముఖం వాచిపోయి, ఆకు కూరకోసం ఎగబడినట్టు ప్రేక్షకులు ఎందుకో ఆ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. సూపర్, డూపర్, బంపర్ హిట్ ఆ సినిమా.

బ్లాక్‌బస్టర్‌గా టీవీల్లో ప్రసారమవుతూనే ఉంది. ఆ విధంగా అర్థంపర్థం లేని ఆ సినిమా సంచలన విజయం నమోదు చేసింది.

పాత చింతకాయ కమర్షియల్ ఫార్ములా తొక్కుల్ని 'కొత్త' అనే ముసుగుతో వాళ్ళు తీసెయ్యడం, మనం అదే భ్రమతో చూసెయ్యడం అలవాటయింది. ఒకప్పటికీ ఇప్పటికీ తేడా ఏంటంటే ఇంతకుముందు సినిమా నిర్మాణం కేవలం కొన్ని సంస్థలకీ, కొంతమందికే పరిమితమయ్యేది! వాళ్ళే లాభాలు గడించేవాళ్ళు, ఇప్పుడు కొత్తవాళ్ళ అదృష్టం వాళ్ళని అందలం ఎక్కిస్తోంది. థియేటర్లు పోయి మల్టీప్లెక్స్‌లొచ్చాయి. ఆ రకంగా వాళ్ళూ ఎదిగారు. ఎటొచ్చీ కొత్తదనపు వినోదంకోసం జేబుకి చిల్లు పెట్టుకునే ఆశావహ ప్రేక్షకుడే దురదృష్టవంతుడు.

ఆ డైరెక్టరూ, డైలాగ్ రైటరూ కొండమీద కోతులయ్యారు.

సెల్: 93 93 98 19 18